ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 25 సెప్టెంబరు 2025



తెలంగాణ పబ్లిక్‌స్కూల్‌ను సందర్శించిన రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

విద్యాప్రమాణాలు పెంపొందించాలి

- రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్
- ఆరుట్ల జడ్పీ హైస్కూల్ సందర్శన

మంచాల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అధ్యాపకులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్‌స్కూల్, మంచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. ముందుగా పాఠశాల అధ్యాపకులతో సమావేశమై విద్యారంగ సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విద్యారంగంపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన ప్రత్యేక సదస్సులో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు, గ్రామపెద్దలతో తరచూ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. విద్యాకమిషన్ సభ్యుడు జ్యోత్స్న, డీఈవో పద్మజ, ఎంఈవో రాందాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్, నారాయణరెడ్డి, రాజగంగారెడ్డి, ఎస్ఎంసీ సభ్యులు జానీపాషా, కంబాలపల్లి భాస్కర్, నూకంరాజు, లాలగారి జంగయ్య, దేవరాజు, శ్రీశైలం, అధ్యాపకులు నరేష్, పారిజాత, జ్యోతి, స్వాతి, పార్వతి, సంధ్య, కృష్ణవేణి, నోడల్ ఆఫీసర్ కిషన్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ సంబురాల వాల్‌పోస్టర్ విడుదల

బతుకమ్మ సంబురాల వాల్‌పోస్టర్ విడుదల

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాంపల్లిలోని టీజీవో భవన్ వద్ద ఈనెల 27న జరిగే బతుకమ్మ సంబురాల వాల్‌పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీవోఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్, సభ్యులు శాంతిశ్రీ, పద్మావతి, అలివేలు, సైదమ్మ, వెంకటేష్, లక్ష్మణస్వామి, రాకేష్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా నిర్వహించాలి

మొయినాబాద్ రూరల్ : జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలను అన్ని శాఖలు సమన్వయంతో వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. కలెక్టర్ బుధవారం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలు, గ్రామాలలో బతుకమ్మ ఆడే ప్రాంతాలు, నిమజ్జనం చేసే చెరువులను ఇతర నీటి వనరుల వద్ద విద్యుత్ దీపాలు, మైకులు ఏర్పాటు చేయాలన్నారు. పరిసరాలను శుభ్రం చేయాలని, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గిన్నిస్‌బుక్‌లో రికార్డు అయ్యేలా ఈ నెల 29వ తేదీ(సోమవారం) సరూర్‌నగర్ స్టేడియంలో పెద్దఎత్తున బతుకమ్మ సంబురాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మధురం.. సీతాఫలం 7



చౌదరిగూడ మండలం వనంపల్లి శివారులో పత్తి పంటలో నిలిచిన నీరు(ఫైల్)

మండలం	దిగుబడి
ఆమనగల్లు	8
కడ్తాల్	9
మాడ్గుల	12
తలకొండపల్లి	9
చేవెళ్ల	12
మొయినాబాద్	8
షాబాద్	9
శంకర్‌పల్లి	10
మంచాల	8
యాచారం	10
కందుకూరు	10
మహేశ్వరం	10
ఫరూఖ్‌నగర్	10
చౌదరిగూడెం	8
కేశంపేట	10
కొందుర్గు	9
కొత్తూరు	7
నందిగామ	7

పత్తి సగటు దిగుబడి అంచనా (ఎకరాకు క్వింటాళ్లలో)

దిగుబడి దిగులు!

- రంగారెడ్డి జిల్లాలో దిగుబడులపై ప్రభావం
- ప్రభుత్వానికి నివేదిక అందజేసిన అధికారులు
- జిల్లాలో సగటున ఎకరానికి 9 క్వింటాళ్ల దిగుబడి
- కొత్తూరు, నందిగామల్లో అతి తక్కువ
- మాడ్గుల, చేవెళ్ల మండలాల్లో అత్యధిక అంచనా

అధిక వర్షాలతో 'పత్తి'కి నష్టమే..



"వానాకాలం సీజన్‌లో వర్షాలు విస్తారంగా కురవడంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పంటల సాగు దాదాపు సగటుకు చేరుకుంది. జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో సాగుచేసే పత్తి పంట ఈ ఏడాది 85శాతం మాత్రమే రైతులు సాగు చేశారు. దీని స్థానంలో వరి సాగు గణనీయంగా పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే పత్తి సాగు కొంత తగ్గినప్పటికీ ఈ ఏడాది కూడా జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో పత్తినే సాగు చేశారు. అయితే ఇటీవల కురిసిన అధిక వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో పంట దెబ్బతింది. అలాగే పూత, పిందె రాలిపోయింది. దీంతో దిగుబడి 20 నుంచి 30శాతం వరకు తగ్గవచ్చని అధికారులు అంచనా వేశారు."

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 1,62,771 ఎకరాల విస్తీర్ణంలో పత్తి వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా.. ఇప్పటి వరకు 1,38,780 ఎకరాల్లో మాత్రమే రైతులు పత్తిసాగు చేశారు. ఒకవైపు పత్తి విస్తీర్ణం తగ్గగా.. మరోవైపు వేసిన పంట అధిక వర్షాల కారణంగా అనేక చోట్ల దెబ్బతింది. ఈ పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా ఉంది. అధిక వర్షాల కారణంగా దిగుబడులు తగ్గే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఈ ఏడాది పత్తి పంటకు జరిగిన నష్టం, దీని కారణంగా దిగుబడులపై ప్రభావం ఎంత ఉంటుందనే దానిపై ఇటీవల వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. పలు మండలాల్లో అధిక వర్షాల వల్ల పత్తిపంటకు కొంత నష్టం జరిగిందని, దీని వల్ల దిగుబడులు తగ్గుతాయని వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. ఈ నివేదిక ప్రకారం జిల్లాలో 1,38,780 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా 1,43,795 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని

మిగతా 8వ పేజీలో...



సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

మెట్రో కోసం పోరాటం చేస్తాం

- బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి

శంషాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధికి మంజూరు చేసిన మెట్రో రైలును కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరితంగా రద్దు చేసిందని, తిరిగి ఏర్పాటు చేసేవరకు పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో రెండు దశాబ్దాల పాటు ఎమ్మెల్యేగా ఉన్న ప్రకాష్‌గౌడ్ చేతగానితనం వల్ల మెట్రో రైలును ఓల్డ్ సిటీకి మార్చారన్నారు. అలాగే ఇప్పుడు ఫ్యూచర్‌సిటీకి మెట్రోరైలు మార్గం ఏర్పాటు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న హైడ్రా వల్ల నియోజవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. అలాగే ఈ ప్రాంతంలో 111జీవో తొలగింపు కోసం మరోసారి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా శంషాబాద్‌కు చెందిన బీజేపీ నాయకుడు కొలను ప్రదీప్ రెడ్డి కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మంచర్ల మోహన్‌రావు, ఏనుగు మురళీధర్‌రెడ్డి, జయమ్మశ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, హనుమంతు, శ్రీనివాస్, దీపామల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా శత చండీయాగం



శత చండీయాగాన్ని నిర్వహిస్తున్న కుర్నమోని జయేందర్ దంపతులు

కందుకూరు మండలంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కందుకూరు, గూడూరు, కొత్తగూడ, దెబ్బడగూడ, నేదునూరు, జైత్వారం, పులిమామిడి, లేమూరు, దాసర్లపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే దాసర్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద బీసీ సంఘం నేత కుర్నమోని జయేందర్ ముదిరాజ్ శత చండీ యాగాన్ని నిర్వహించారు.

కందుకూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి)



వైభవం.. వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవం

చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో దసరా బ్రహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రతీరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి స్వామివారి సేవా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యారు. అలాగే మహిళల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. దీంతో ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దేవుని వామనాచార్యులు, భక్తులు, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చేవెళ్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి)

అన్నపూర్ణాదేవి అలంకారంలో..

ఇబ్రహీంపట్నంలోని ఈశ్వరాంజనేయ స్వామి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు బుధవారం దుర్గాదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి)



తిండి తిప్పలు మాని..

రైతులను వెంటాడుతున్న యూరియా కష్టాలు

- టోకెన్ల కోసం గంటలతరబడి క్యూలో..
- కేశంపేటలో 450 బస్తాల యూరియా పంపిణీ

కేశంపేట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండలంలో యూరియా కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. సరిపడా పంపిణీ చేయకపోవడంతో గంటలతరబడి క్యూలో నిలబడాల్సి వస్తోంది. మండల కేంద్రంలో బుధవారం కొత్తపేట ప్యాక్స్ ఆధ్వర్యంలో 450 బస్తాల యూరియా పంపిణీ చేశారు. అక్కడికి వచ్చిన రైతులందరికీ పూర్తిస్థాయిలో యూరియా అందకపోవడంతో నిరాశ చెందారు. చేసేదేమీలేక రేపు, మాపో పంపిణీ చేసే యూరియా కోసం టోకెన్లు తీసుకోవడానికి గంటల తరబడి క్యూలో వేచి ఉన్నారు. మండలంలో ఐదు రోజులుగా యూరియా పంపిణీ చేస్తున్నా రైతులకు పూర్తి స్థాయిలో యూరియా అందకపోవడం శోచనీయం. కేశంపేట, కొత్తపేట గ్రామాలలోనే యూరియా పంపిణీ చేస్తుండటంతో మండలంలోని రైతులందరూ అక్కడికే వెళ్లాల్సి వస్తుంది. ఇది రైతులకు దూర భారంగా మారింది. రైతు వేదిక క్లస్టర్ల వారీగా యూరియా సప్లయ్ చేస్తే క్యూలైన్ల బాధలు తప్పుతాయని రైతులు అంటున్నారు. ఒక క్లస్టర్ల పరిధిలో మూడు, నాలుగు గ్రామాలు ఉంటాయని, ఆ రైతులకు రైతు వేదికలో యూరియా సప్లయ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రైతు వేదికలలో యూరియా నిల్వచేసుకునే అవకాశం ఉన్న అధికారులు ఎందుకు చర్యలు తీసుకుంటలేరో అర్థకావడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు.



కొందుర్గు : శ్రీరంగాపురంలో..



టోకెన్ల కోసం క్యూలో రైతులు

క్లస్టర్ల వారీగా యూరియా పంపిణీ చేయాలి



క్లస్టర్ వారీగా యూరియా పంపిణీ చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఒక క్లస్టర్‌కు 3 నుంచి 4 గ్రామాలు ఉంటాయి. యూరియాను రైతు వేదికలలో నిల్వచేసి, రైతులకు అందించాలి. మండలాల వారీగా పంపిణీ చేస్తే యూరియా సమస్య పరిష్కారం కాకపోగా రైతులు రోజుల తరబడి పడిగాపులు కాయాల్సివస్తుంది.

జగన్‌హన్ రెడ్డి, రైతు, కొండారెడ్డిపల్లి

ఐదు రోజులలో 2,250 బస్తాలు..

ఐదు రోజులు కంటిన్యూగా 2,250 బస్తాల యూరియా పంపిణీ చేశాం. ఇంకా క్యూలో రైతులు ఉంటున్నారంటే యూరియాను కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు అనుమానం వస్తుంది. రైతుల అవసరం మేరకు యూరియా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

- శిరీష, ఏవో, కేశంపేట

ప్రభుత్వ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- డీడీఎంహెచ్‌వో విజయలక్ష్మి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

కొత్తూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య సేవలు ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీలో స్వస్త్ నారీశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా డాక్టర్ దీప్తి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక డాక్టర్ల బృందం చేత మహిళలకు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయబడుతుందన్నారు. ముఖ్యంగా మహిళలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే సీజన్‌ల వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలన్నారు. ఆరోగ్య సమస్యలే ఏమొచ్చినా ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి డాక్టర్ల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. వైద్య శిబిరంలో దాదాపు రెండు వందల మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సరిత, ఉదయ్, జాన్సీ, మానస, సీహెచ్‌వో నాగేష్, సూపర్‌వైజర్ అనసూయ, సిబ్బంది. ఆశాలు పాల్గొన్నారు.



రాందేవ్‌రావుతో బెల్లంకొండ సాయిశ్రీనివాస్

ఎకోఫ్రెండ్లీ పార్కులో బెల్లంకొండ సందడి

శంకర్‌పల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రొద్దటూరులోని ఎక్స్‌పీరియం ఎకోఫ్రెండ్లీ పార్కును బుధవారం ప్రముఖ సినీహీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ సందర్శించారు. ఆయన తన కుటుంబీకులతో కలిసి పార్కుకు వచ్చారు. ఆ పార్కు ఎండీ రాందేవ్‌రావు దగ్గరుండి ఏళ్లనాటి అరుదైన చెట్లు, మొక్కల గురించి వివరించారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

- సినీనటుడు పృథ్వీరాజ్



శివలింగానికి మొక్కుతున్న పృథ్వీరాజ్

శంకర్‌పల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని సినీ నటుడు పృథ్వీరాజ్ తెలిపారు. మండల పరిధిలోని చందిప్పలోని మరకత శివాలయాన్ని బుధవారం పృథ్వీరాజ్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని శివలింగానికి అభిషేకంతో పాటుగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురాతన మరకత శివలింగాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వారిని మరకత శివాలయ చైర్మన్ గోపాల్‌రెడ్డి కండువాతో సత్కరించి, మరకత శివాలయ చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు హనుమంతు, గోపాల్ తదితరులు ఉన్నారు.

పండుగకు పస్తులేనా?

- పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందక ఇబ్బందులు
- భారంగా కుటుంబ పోషణ


నిలిచిన పంచాయతీ ట్రాక్టర్

మోమిన్‌పేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నెలల తరబడి వేతనాలు రాక, అప్పు పుట్టక రోజువారీ ఆహారాన్ని సమకూర్చుకోలేని దయనీయ స్థితిలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మోమిన్‌పేట్ మండలం వివిధ గ్రామాల కార్మికుల కుటుంబాలు పండుగ రోజుల్లోనూ పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది. మూడు నెలలుగా వేతనాలందడం లేదని కార్మికులు చెబుతున్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, ఇచ్చే తక్కువ జీతం కూడా ఇవ్వక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు వాపోతున్నారు. మండలంలో 28 పంచాయతీల్లో 98 మంది కార్మికులు ఉన్నారు. ఒక్కో గ్రామానికి ముగ్గురు నుంచి 10 మంది చొప్పున పని చేస్తున్నారు. ఒక్కో కార్మికుడికి నెలకు రూ.9,500 వేతనం ఇస్తున్నారు. అయితే మెజార్టీ గ్రామాల్లో కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు. దీంతో బతుకమ్మ, దసరా పండగలు చేసుకోలేని పరిస్థితి నెలకొంది.

నిలిచిన చెత్త సేకరణ

సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి రెండేళ్లవుతోంది. చెత్త సేకరణ ట్రాక్టర్లలో పంచాయతీ కార్యదర్శులు కొంతకాలం సొంత డబ్బుతో డీజిల్ పోయించారు. వారికి బిల్లులు పేరుకుపోవడంతో ట్రాక్టర్ల నిర్వహణ తమతో కాదని చేతులెత్తేశారు. దీంతో చెత్త సేకరణ నిలిచింది. పల్లెల్లో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకున్నాయి. పారిశుధ్య లోపంతో రోగాలు ప్రబలుతున్నాయి.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. దసరా, బతుకమ్మ పండుగలకు కుటుంబ సభ్యులకు బట్టలు కొనలేని దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు మా వేతనాలందించి ఆదుకోవాలి.
- కొండగల్ల నర్సిములు, పంచాయతీ కార్మికుడు, టేకులపల్లి

మూడు నెలలుగా వేతనాలు రాలేదు



ఐదారు నెలలకోసారి వేతనాలు ఇస్తున్నారు. దీంతో మాకు కుటుంబ పోషణ భారంగా మారింది. పండుగలకైనా వేతనాలు త్వరగా ఇస్తారని అనుకుంటే పాలకులు పట్టించుకోవడం లేదు. పండగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితే ఉంది.
- నాగరాజు, కార్మికుల సంఘం నాయకుడు

రూ.57కోట్లతో ఆమనగల్లు మునిసిపాలిటీ అభివృద్ధి

- రూ. 32కోట్ల పనులు ప్రారంభం
- రూ.10కోట్ల విలువైన పనులకు నేడు శంకుస్థాపన : ఎమ్మెల్యే కసిరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పురపాలక సమగ్రాభివృద్ధికి రూ.57కోట్లతో పనులు చేపడుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఇప్పటికే రూ.32కోట్ల పనులు ప్రారంభించామన్నారు. రూ.10కోట్లతో చేపట్టే పనులకు ఎంపీ మల్లు రవితో కలిసి గురువారం శంకుస్థాపన చేస్తామని చెప్పారు. ఆమనగల్లులోని కల్యాణి గార్డెన్‌లో బుధవారం కమిషనర్ శంకర్‌నాయక్, టీపీసీసీ మెంబర్ ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలతో కలిసి విలేకరులతో వివరాలు వెల్లడించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరగా రూ.15కోట్లు మంజూరు చేశారని తెలిపారు. పట్టణంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, స్ట్రీట్ లైట్లు, పార్కులు, కార్యాలయ భవనం, సురసముద్రం చెరువు బ్యుటిఫికేషన్ పనులు చేపడుతున్నట్లు వివరించారు. కాంగ్రెస్ పాలనలో ఆమనగల్లును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. రెండు నెలల్లో పాలిటెక్నిక్, డిగ్రీ, జూనియర్ కాలేజీల భవనాలకు శ్రీకారం చుడతామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ధనుంజయ్య, అనితవిజయ్, జగన్, ప్రభాకర్‌రెడ్డి, బిచ్యా, మానయ్య, మోహన్‌రెడ్డి, మండ్లీ రాములు, వస్పుల శ్రీశైలం, శ్రీకాంత్, బాబ, పరమేశ్, ఫరీద్, కుమార్, తులసీరామ్, శ్రీను, నాజర్, అలీం, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరుగనివ్వ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రిపుల్‌ఆర్ నిర్మిస్తాయని, ఈ రోడ్డుకు భూములు పోయే రైతులకు అన్యాయం జరుగకుండా చూస్తానని, ఏ పోరాటానికైనా వెనకాడనని ఎమ్మెల్యే అన్నారు. కొందరు ట్రిపుల్ విషయంలో తనపై ఆరోపణలు చేయడం సరికాదని, ప్రజలకు అందుబాటులో సమస్యలు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.

గ్రామాల్లో వీధి కుక్కల బెడద


మల్కాపూర్‌లో కుక్కల బెడదపై వివరిస్తున్న గ్రామస్తులు



తాండూరు రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో వీధి కుక్కలు మనుషులపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. పిల్లలు ఒంటరిగా బయటికి వస్తే ఎగబడి కరుస్తున్నాయి. తాండూరు మండల అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మల్కాపూర్, కోట బాస్పల్లిలో గ్రామాల్లో వారం రోజులుగా కుక్కల బెడద ఎక్కువైంది. మల్కాపూర్‌లో బయటకు వెళ్లాలంటేనే భయమవుతోందని గ్రామస్తులు అంటున్నారు. ఏ వీధిలో చూసినా కుక్కల గుంపు కనిపిస్తోందని, తాము ఏమీ అనకున్నా గుంపులుగా ఉన్న కుక్కలు మూకుమ్మడిగా పైకివస్తూ కరుస్తున్నాయని తెలిపారు. వారం రోజుల క్రితం బంగారుపల్లి ఆనంద్‌ను కుక్కలు కరవడంతో బాలుడి తొడకు గాయమైంది. మన్నాన్‌పల్లి బాల్‌రాజ్, మాణిక్యప్ప, హన్మంతు, ప్రణయ్, భాగ్యం ఇలా 20మందిని కుక్కలు కరిచి గాయపరిచాయి. ఈ మధ్య రేబిస్ వ్యాధితో పలువురు మరణిస్తుండడంతో మల్కాపూర్ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకునేందుకు ఆస్పత్రికి వెళ్తున్నారు. పిల్లలను ఒంటరిగా బయటికి పంపాలంటే భయపడుతున్నారు. ప్రధానంగా మైసమ్మగుడి వద్ద కుక్కలు గుంపులుగా ఉంటున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని కోరుతున్నారు.

పట్నం సీహెచ్‌సీలో 'సేవా పక్వాడా'

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో సీహెచ్‌సీలో పరిసరాలను శుభ్రం చేశారు. మోదీ ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో ప్రచారం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మహేష్‌గౌడ్ అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఎక్కువ స్థానాల్లో గెల్చేలా కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టేకుల రాంరెడ్డి, జెనిగె శ్రీనివాస్‌యాదవ్, పంది మహేందర్, ఆకుల సంతోష్, సురేష్, శివ పాల్గొన్నారు.


సీహెచ్‌సీ పరిసరాలను శుభ్రం చేస్తున్న నాయకులు

దళితబంధు యూనిట్‌ను పరిశీలించిన ఎస్సీ కార్పొరేషన్ కమిషనర్

ధారూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేరెల్లిలో గతంలో మంజూరు చేసిన దళితబంధు యూనిట్‌ను రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ కమిషనర్ క్షితిజ, డెవలప్‌మెంట్ సెక్రటరీ జ్యోతిబుద్ధప్రసాద్‌లు బుధవారం పరిశీలించారు. దళితబంధు కింద చుక్కయ్యకు రూ.పది లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ డబ్బుతో ఆయన కోళ్ల ఫారం యూనిట్‌ను ప్రారంభించారు. యూనిట్‌ను పరిశీలించిన అధికారులు ప్రభుత్వం నుంచి అందిన రూ.10లక్షలు సరిపోయాయా? అని అడిగారు. యూనిట్‌కు రూ.10లక్షలు సరిపోలేదని, తాను సొంతంగా రూ.4లక్షలు అదనంగా పెట్టుకున్నానని తెలిపారు. కోడి పిల్లల విత్తనం తీసుకువచ్చి పెంపకం చేసి విక్రయిస్తామని, ఏడాదికి ఐదు క్రాప్‌లు వస్తుందని ఆయన వారికి వివరించారు. ఒక్కో క్రాప్‌కు ఖర్చులుపోను రూ.50వేల వరకు ఆదాయం వస్తుందని ఆయన అధికారులకు వివరించారు.

వైద్య పరిశోధనలపై మెడిసిటీ ఒప్పందం

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ వైద్య పరిశోధనల కోసం తమ సంస్థ సనాతన జీవన్ ట్రస్టు-చీరాలతో ఒప్పందం కుదుర్చుకుందని మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాల ప్రెసిడెంట్ కె.శివరామకృష్ణ అన్నారు. బుధవారం మెడికల్ కళాశాల వారు ఈ మేరకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాను సమర్పించుకున్నారు. కె.శివరామ కృష్ణ మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్య విధానంలో కొత్త పరిశోధనలు చేయాలన్న సంకల్పంతో ఈ ఒప్పందాన్ని చేసుకున్నట్లు తెలిపారు. రెండు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు పరస్పరం సహకరించుకుంటూ వైద్య రంగంలో పరిశోధనలు చేసి నూతన అవిష్కరణలకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో సనాతన ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి పూజ

కడ్తాల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మద్దెల కుంట తండాలో తుల్జా భవానీ మాత, సేవాలాల్ స్వాముల ఇరుముడి పూజా కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు కొనసాగాయి. కార్యక్రమానికి ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్రఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్ హాజరై పూజలు నిర్వహించారు. ప్రతీ ఒక్కరు దైవ చింతనతో ముందుకు సాగాలని కోరారు. నాయకులు, స్వాములు పాల్గొన్నారు.




పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శాంతిశ్రీ

శిశువుకు తల్లిపాలే శ్రేష్ఠం

మహేశ్వరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పుట్టిన ప్రతీ బిడ్డకు తల్లి పాలను మించిన బలమైన ఆహారం లేదని మహేశ్వరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. బుధవారం తుక్కుగూడ పరిధి రావిరాలలో పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శిశువు పుట్టిన గంటలోపు తాగించే ముర్రుపాలపై వివరించారు. అంగన్‌వాడీ సెంటర్లలో తల్లులకు, పిల్లలకు, బాలింతలకు ఇచ్చే పోషకాహారంపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దేవమ్మ, కవిత, అనురాధ, విజయ, జగదాంబ పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషి


కొత్తూరులో మాట్లాడుతున్న అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్ జీ

కందుకూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కొత్తూరులో ఉన్న సామాజిక గ్రంథాలయాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషిచేస్తానని అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ అన్నారు. బుధవారం గ్రామస్తులు, యువకుల విజ్ఞప్తి మేరకు బ్రాంచ్ లైబ్రరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రంథాలయాలు విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఉపయోగపడతాయన్నారు. విడతల వారీగా ఈ లైబ్రరీకి వెయ్యి పుస్తకాలను తాను అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ టి.శ్రీనివాస్, శ్రీనివాస్, రాజేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అలైన్‌మెంట్‌ను మార్చే వరకు దీక్షలు


దీక్షలో పాల్గొన్న భూ నిర్వాసితులు, నాయకులు

కడ్తాల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అలైన్‌మెంట్‌ను మార్చి టవర్ల నిర్మాణ పనులను నిలిపివేసే వరకు పోరాటం చేస్తామని కడ్తాల హైటెన్షన్ లైన్ భూ నిర్వాసితులు స్పష్టం చేశారు. కడ్తాల సమీపం నుంచి పొలాల మీదుగా ఏర్పాటు చేస్తున్న 765కేవీ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 17వ రోజుకు చేరాయి. రైతులు, నాయకులు వరికుప్పల అంజనేయులు, రవి, రమేశ్, మల్లేశ్, రాజు దీక్షలో కూర్చున్నారు. వారికి దళిత మోర్చా ఉపాధ్యక్షుడు యాదగిరి సంఘీబావం తెలిపారు. ప్రజాప్రతినిధులు రైతుల ఆవేదనను ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి అలైన్‌మెంట్ మార్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేందర్, జంగయ్య, రామకృష్ణ, పెంటారెడ్డి, కృష్ణ, పర్వతకుమార్, రాజేందర్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా చూస్తా : ఎంపీ


ఎంపీ మల్లు రవికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

కడ్తాల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎవరికి అన్యాయం జరుగకుండా చూస్తానని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. కడ్తాల మీదుగా తలపెట్టిన 765హైటెన్షన్ లైన్ అలైన్‌మెంట్ గూర్చి కలెక్టర్‌తో మాట్లాడుతానని తెలిపారు. హైటెన్షన్ లైన్ భూనిర్వాసితులు బుధవారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎంపీ రవిని కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని ఎంపీ హామీ ఇచ్చారు.

నియోజకవర్గ ప్రజలందరికీ వైద్య పరీక్షలు


మెడికల్ కిట్లు అందజేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలందరికీ ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించేందుకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వన్‌మెడి సంస్థతో మొబైల్ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు టాస్క్ సీవోవో, ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పలుగు తండాలో మొబైల్ హెల్త్ క్యాంప్‌ను రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. 250మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. నాయకులు నారాయణ, రవీందర్, రమేశ్, గేమ్యా, బీచ్యా, రాజు, జీవ్లా, హర్యా, భాస్కర్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువును పరిశీలించిన అధికారులు



బొంరాస్‌పేట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):బొంరాస్‌పేట్ పెద్ద చెరువు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిండి అలుగుపారింది. చెరువుకు గండి పడి నీరు లీక్ అవుతోంది. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, ప్రధాన కార్యదర్శి రాంచందర్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ డీఈ కిరణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేయాలని నాయకులు అధికారులను కోరారు. ఏఈ వంశీధర్, రైతులు ఉన్నారు.



పాండురంగారెడ్డికి కండువా కప్పుతున్న కవిత

ప్రజావ్యతిరేక పాలన అంతం కావాలి

- సామాజిక తెలంగాణతో కూడిన ప్రభుత్వం రావాలి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులకు కండువాలు కప్పి జాగృతిలోకి ఆహ్వానించిన కవిత

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజావ్యతిరేక పాలన అంతం కావాలంటే.. రాష్ట్రంలో సామాజిక తెలంగాణతో కూడిన ప్రభుత్వం అధికారంలోకి రావాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం కవిత సమక్షంలో జాగృతిలో చేరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయులు అందుగుల సత్యనారాయణ, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు బొల్లారం వెంకట్‌రెడ్డి, నాయకులు గణేష్ నాయక్, ఉండె బాబూరావు, శివరామకృష్ణారెడ్డిలకు ఆమె కండువా కప్పి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ.. జాగృతి బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నవీన్‌చారి, అర్చన సేనాపతి, కోల శ్రీనివాస్, కంచర్ల శివారెడ్డి, సంపత్‌కుమార్, రవీందర్, భూషన్‌గౌడ్, జంగయ్యగౌడ్, కిరణ్‌కుమార్, యాదగిరి, శ్రీనివాస్, నవీన్‌గౌడ్, అమీన్ సుల్తానియా, లావణ్య పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ వ్యతిరేక పోరాటానికి మద్దతివ్వండి



మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని కలిసిన రైతులు, నాయకులు

పరిగి,సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తమ గ్రామాల మీదుగా ట్రిపుల్‌ఆర్, రేడియల్ రోడ్డు నిర్మాణాలొద్దని, వీటిని వ్యతిరేకిస్తూ చేస్తున్న పోరాటంలో తమకు అండగా నిలవాలని రైతులు బుధవారం పరిగిలో మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డిని కలిశారు. తమ గ్రామాల మీదుగా రోడ్లు వెళ్లడం ద్వారా పంట భూములు కోల్పోతామని, ఈ విషయంలో ప్రభుత్వంపై చేస్తున్న పోరాటంలో తమ వెంట నడవాలని విన్నవించారు. దీనిపై మహేశ్‌రెడ్డి స్పందిస్తూ.. ఎవరికీ అన్యాయం జరుగకుండా చూస్తామని, రైతులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం రైతుల మేలు కోరాలని సూచించారు. కాగా దోమ మండలం కొండాయపల్లిలో ఈ నెల 28న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మహేశ్‌రెడ్డి విడుదల చేశారు.

భూ నిర్వాసితులకు సీపీఎం అండ



రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పూడూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాజెక్టుల కింద భూమి పోయే నిర్వాసితులకు సీపీఎం అండగా ఉంటుందని పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్, జిల్లా కమిటీ సభ్యుడు పి.రామకృష్ణ అన్నారు. బుధవారం మంచన్‌పల్లి, కంకల్ గ్రామాల్లో నాయకులు పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వికారాబాద్ జిల్లాలో 23గ్రామాల్లో రైతులు భూమి కోల్పోతున్నారని తెలిపారు. రైతుల భూములు తీసుకుంటే సహించేది లేదన్నారు. ట్రిపుల్‌ఆర్ అలైన్మెంట్ శాస్త్రీయంగా జరగాలన్నారు. నిర్వాసితుల సమస్యలపై ఉద్యమిస్తామని తెలిపారు. రైతులకు, పేదలకు నష్టంజరుగకుండా చూడాలన్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు రామచంద్రయ్య, శ్రీనివాస్, జంగయ్య, చంద్రయ్య అంజయ్య, రవికుమార్, సర్వేశ్, వెంకటేష్, రాములు, మల్లేశం, శివయ్య, మల్లయ్య, బాబు పాల్గొన్నారు.

దళితుల భూములను అప్పగించాలి

బంట్వారం: దళితులకు కేటాయించిన భూములను తిరిగి వారికి అప్పగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం బంట్వారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. బోపునారంలో సర్వే నంబర్ 69లోని 187ఎకరాలను దళితులకు కేటాయించారని, ఆ భూములను గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా పట్టాలు చేసుకుని ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. అదే సర్వే నంబరులో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను ఆపాలని, దళితుల భూములు తిరిగి వారికి అప్పగించాలన్నారు.

రోడ్డు మరమ్మతులు చేయించిన ఎమ్మెల్యే



గుంతల్లో కాంక్రీట్ వేయిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పూడూరు, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో రోడ్డు గుంతల్లో కాంక్రీట్ వేశారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులకు అడ్డంకులు తొలగించాలని నేషనల్ హైవే విస్తరణ సాధన సమితి సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. రహదారిపై గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డుపై పడిన గుంతలకు కాంక్రీట్ వేయించారు.

మధురం.. సీతాఫలం

పోషకాల సమాహారం

- జోరుగా సాగుతున్న అమ్మకాలు
- డజన్‌కు రూ.200 నుంచి రూ.300
- కాయల సేకరణతో గ్రామీణులకు ఉపాధి

ఆమనగల్లు/దుద్యాల/కొడంగల్ రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పేదల నుంచి సంపన్నుల వరకు, చిన్నాపెద్ద అందరూ ఇష్టపడే ఫలం సీతాఫలం. ఆకలి తీర్చుకునేందుకు సీతాఫల కాయలు కాల్చుకొని తిని గ్రామీణులు, పేదలు సంతృప్తి పడితే.. కస్టర్డ్ యాపిల్‌గా పిలుచుకుంటూ సీతాఫలాన్ని సంపన్నులు ఇష్టంగా తింటారు. ఈ కాలంలో విరివిగా లభించే సీతాఫలంలో పోషకాలు ఎక్కువ. పల్లె, పట్టణ ప్రాంతాల్లో ప్రతీ సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో సీతాఫలం పండ్లు ఎక్కువగా లభిస్తాయి. ఈ సారి వర్షాలు బాగా కురియడంతో ఇప్పటికే సీతాఫల కాయలు, పండ్లు మార్కెట్లో లభ్యం అవుతున్నాయి. అటవీ ప్రాంతాలు, పొలాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సీతాఫలాల లభ్యత ఎక్కువ. కొందరు రైతులు సీతాఫల తోటలు సైతం సాగు చేస్తున్నారు. అయితే గతంలో మాదిరి పొలం గట్ల వద్ద చెట్లు తగ్గడం, సాగు భూములు రియల్ ఎస్టేట్‌కు మళ్లడంతో పండ్ల



దిగుబడి తగ్గి డిమాండ్ పెరిగింది. గతంలో నాలుగైదు రూపాయలకు వచ్చే ఒక పండు ఇప్పుడు పది పన్నెండు రూపాయలకు పెరిగింది.

పండ్లకు ఆమనగల్లు ప్రాంతం ప్రసిద్ధి

సీతాఫలాల దిగుబడిలో ఆమనగల్లు, కడ్తాల ప్రాంతాలకు గుర్తింపు ఉంది. చరికొండ, ముద్విన్, మైసిగండి, ఎక్వాయిపల్లి, గోవిందాయిపల్లి, వాసదేవ్‌పూర్, కోనాపూర్, చెన్నారం, అన్మాస్‌పల్లి, చల్లంపల్లి, రాంనుంతల, అయ్యసాగర్, విఠాయిపల్లి, మంగళపల్లి, మాలెపల్లి గ్రామాలు సీతాఫలాలకు ప్రసిద్ధి. ఇక్కడి ఫలాలు హైదరాబాద్, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతవుతుంటాయి. టోకు వర్తకులు ఇక్కడికొచ్చి కూలీలు, రైతుల నుంచి సేకరించి తరలిస్తుంటారు.



కొడంగల్ శివారులో సీతాఫలాల విక్రయం

శ్రీశైలం-హైదరాబాద్ హైవేపై విక్రయాలు జోరందుకున్నాయి. వంద కాయల గంప కాయల నాణ్యతను బట్టి రూ.500 నుంచి వెయ్యి వరకు అమ్ముతున్నారు. కొడంగల్ మండలం మైసమ్మకుంట, పోశమ్మకుంట, ఆశమ్మకుంట తండా వాసులు కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తా, శివారు జాతీయ రహదారిపై సీతాఫలాలు అమ్ముతున్నారు.

పోషకాల ఘని...

సీతాఫలంలో కాల్షియం, విటమిన్-సి సమృద్ధిగా లభిస్తాయి. ఆహారం తేలిగ్గా జీర్ణమయ్యేందుకు పీచుపదార్థం తోడ్పతుంది. ఈ పండు తింటే రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి పెరుగుతుంది. నియాసిన్, కెరోటిన్, థైమిన్‌లు సమృద్ధిగా ఉంటాయి. అల్సర్లను నయం చేస్తుంది. ఎసిడిటీని నివారిస్తుంది. కండరాల దృఢత్వానికి ఈ ఫలంలోని మెగ్నిషియం తోడ్పడుతుంది. సీజన్‌లో రోజూ సీతాఫలం తింటే కడుపులో మంట, ఉబ్బసం తగ్గుతాయి. ఈ పండు తింటే నరాల బలహీనతనూ అధిగమించొచ్చు. మలబద్ధక నివారణకు దివ్య ఔషధం. అయితే మధుమేహ రోగులు ఈ పండు తినొద్దని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే సీతాఫల ఆకులకు మధుమేహం, బరువు తగ్గించే గుణాలున్నాయి.



కొడంగల్‌లో సీతాఫలాలు అమ్ముతున్న మహిళలు

కాయలు పిరమైనయ్



సీతాఫల చెట్లు తరిగిపోతున్నాయి. కాయలు దొరక్క రేట్లు పెరిగాయి. స్థానికులు ఇంత ధరపెట్టలేరు. బయటి నుంచి వచ్చే వారే కొంటున్నారు. గిరిజనుల నుంచి ఒక పెట్టె కాయలు రూ.800 నుంచి 1,200కు తీసుకొని మేం డజన్లు, కిలోల లెక్కన అమ్ముకుంటున్నాం.

- గీత, విక్రయదారు, కడ్తాల్

మూడు నెలలు ఉపాధి



సీతాఫలాల విక్రయాలతో మాకు ఏటా మూడు నెలలు ఉపాధి దొరుకుతుంది. కొన్నేళ్లుగా కాయల లభ్యత తక్కువై రేటు పెరిగింది. తండాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు తరలిస్తుండడంతో స్థానికంగా కాయలు దొరకక ధర పెరుగుతోంది.

- ఆనంద్, కడ్తాల్

సీజన్‌లో అమ్మకాలతో ఆదాయం



తండా సమీపం అడవిలోకి ఇంటిల్లిపాది ఉదయమే పోయి సీతాఫలాలను సేకరిస్తాం. కొడంగల్‌కు తెచ్చి అమ్ముతున్నాం. పెద్దవారు సీతాఫల కాయలను పట్టణానికి తెస్తారు. పిల్లలు, వృద్ధులు కాయలు తెంపుకొచ్చేందుకు పోతారు. సీతాఫలాలు అమ్మకంతో కొంత డబ్బు వస్తోంది.

- సోనీబాయి, మైసమ్మతండా, కొడంగల్

అన్ని రకాల పోషకాలు లభ్యం



సీతాఫలంతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. విటమిన్-ఎ, మెగ్నీషియం, పోటాషియం, ఫైబర్, విటమిన్-బీ6, కాల్షియం, విటమిన్-సి, ఐరన్ వంటి పోషకాలు ఉంటాయి. సీతాఫలాన్ని అల్పాహారంగా తీసుకుంటే కండరాలు, నరాల బలహీనత వ్యాధులు తగ్గుతాయి. శరీరంలో పేరుకున్న కొవ్వును ఈ ఫలం తగ్గిస్తుంది. రక్తం తక్కువున్న వారు ఈ ఫలాన్ని ఎక్కువగా తినాలి.

- డాక్టర్ హేమ్‌లాల్, ఆమనగల్లు



మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

- చేవెళ్ల, మల్కాజ్‌గిరి ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, రాజేందర్
- షాపులను సందర్శించి రేట్ల వివరాల సేకరణ

చేవెళ్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో పేదలు, సామాన్య ప్రజలకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. జీఎస్టీ తగ్గింపు నేపథ్యంలో బుధవారం చేవెళ్లలోని పలు దుకాణాలను సందర్శించి వస్తువుల ధరలపై వివరాలను సేకరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ జీఎస్టీ తగ్గించి ప్రజలపై ఆర్థిక భారాన్ని తొలగించారన్నారు. జీఎస్టీ స్లాబ్‌లను ఐదు, పన్నెండు శాతాలకు తగ్గించడం, కొన్ని వస్తువులపై మొత్తమే ఎత్తివేయడంతో పేదల ఆదాయంలో నెలకు కనీసం 20శాతం ఆదా అవుతుందని ఎంపీ అన్నారు. రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. టీవీలు, ద్విచక్ర వాహనాలు, సామాన్యులు కొనే వస్తువులపై పన్ను భారం తగ్గుతుందని చెప్పారు. ఇంటి నిర్మాణ మెటీరియల్ ధరలు కూడా దిగుతాయన్నారు. బీమాలపై జీఎస్టీని ఎత్తివేశారని తెలిపారు. దేశంలో కులమతాల పేరిట దేశాన్ని ముక్కలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాములు, వాసుదేవ్ కన్నా, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, సామ మాణిక్యరెడ్డి, కృష్ణాగౌడ్, కృష్ణారెడ్డి, కృష్ణమోహన్, సత్యనారాయణ, కృష్ణ, వెంకట్‌రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ భారాన్ని తగ్గించిన ప్రధాని

మేడ్చల్ టౌన్: జీఎస్టీ తగ్గడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరగనుందని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం మేడ్చల్‌లోని దుకాణాలను ఆయన సందర్శించి వ్యాపారులతో మాట్లాడారు. పేదలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకే ప్రధాని మోదీ జీఎస్టీ స్లాబ్‌లను కుదించారన్నారు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గింపుతో ఎంతో మేలు కలగనుందన్నారు. ఎంపీ మొబైల్, మెడికల్ షాపులను, కిరాణ దుకాణాలను సందర్శించి జీఎస్టీ తగ్గింపు ఇస్తున్నారా? లేదా? అని వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. చేకూరుతున్న ప్రయోజనాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పట్టణంలో నెలకొన్న మంచినీటి సమస్యపై ఎంపీకి తెలుపగా అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, బీజేపీ పట్టణాధ్యక్షురాలు శైలజ, కార్యకర్తలు పాల్గొన్నారు.

రతన్‌సింగ్ సేవలు చిరస్మరణీయం



రతన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడిగా రతన్‌సింగ్ అందించిన సేవలు చిరస్మరణీయమని కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, మాజీ మంత్రి జక్కుల చిత్తరంజన్‌దాస్, రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు వెంకటేష్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, టీశాట్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డిలు అన్నారు. మనుషులు చేసిన మంచి పనులు మరణానంతరం కీర్తించబడుతాయని అన్నారు. పీసీసీ అధికార ప్రతినిధి, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీ సింగ్ తండ్రి రతన్‌సింగ్ సంస్మరణ కార్యక్రమాన్ని బుధవారం కల్వకుర్తిలోని కేసీఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి, కల్వకుర్తి, వెల్దండ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. రతన్‌సింగ్ చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఎడ్మ సత్యం, శ్రీశైలం, భృంగి ఆనంద్‌కుమార్, గూడూరు భాస్కర్‌రెడ్డి, భూపతిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, యాట నర్సింహ, యాదిలాల్, గుర్రం కేశవులు, సంజీవ్‌కుమార్, విజేందర్, గురువయ్య, పర్వత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బీచ్యనాయక్, వస్పుల జంగయ్య, శ్రీకాంత్, శ్రీశైలం, ఫరీద్, కృష్ణనాయక్, జగన్, మానయ్య, మిట్టపల్లి అంజయ్య, సర్దార్ నాయక్, సుధాకర్, రఘురాములు, రుక్మేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహేందర్‌రెడ్డి కుటుంబాన్ని శిక్షించాలి



మహిళా కమిషన్ సభ్యులతో స్వాతి కుటుంబ సభ్యులు

వికారాబాద్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్వాతి మృతి కేసులో నిందితుడు మహేందర్‌రెడ్డితో పాటు అతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని స్వాతి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం స్వాతి తండ్రి బి.రాములు, బందెయ్య, రామచంద్రి, శివకుమార్ ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మహిళా కమిషన్‌ను ఆశ్రయించారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, కార్యదర్శి వై.గీత మాట్లాడుతూ.. వివాహానంతరం స్వాతిని భర్త మహేందర్‌రెడ్డి, అతడి కుటుంబ సభ్యులు వేధించారని, చివరకు పక్కా ప్లాన్‌తో హత్య చేశారని ఆరోపించారు. నెల రోజులు గడిచినా మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేయకపోవడం విచారకరమని, ప్రభుత్వం వారందరినీ కఠినంగా శిక్షించాలన్నారు. కమిషన్ కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

బురదలో కూరుకుపోయిన కాంక్రీట్ మిక్సర్



తాండూరు రూరల్, సెప్టెంబర్ 24, (ఆంధ్రజ్యోతి): నడి రోడ్డుపై బురదలో కాంక్రీట్ మిక్సర్ లారీ కూరుకుపోవడంతో తాండూరు-చించొళ్లి రోడ్డులో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అల్లాపూర్ నుంచి కొత్లాపూర్ వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఐనెల్లి శివారు వద్ద హైవే అధికారులు కల్వర్టును తొలగించి పైపులు వేసి రోడ్డుపై మట్టివేశారు. వర్షాల కారణంగా రోడ్డు గోతులమయమైంది. సిమెంటు లోడ్‌తో వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ బురదలో కూరుకుపోయింది. చాలా సమయం తర్వాత లారీని జేసీబీతో బయటకు తీశారు.

ప్రమాదకరంగా ఎన్‌హెచ్ 167ఎన్

- కొనసాగుతున్న విస్తరణ పనులు
- బురదలో దిగబడుతున్న వాహనాలు




కొడంగల్ రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ నుంచి కర్ణాటకలోని చించోలి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి 167ఎన్ పనుల్లో భాగంగా మండలంలోని పర్సాపూర్ వద్ద పనులు కొనసాగుతున్నాయి. వర్షాలకు తోడు మట్టిరోడ్డు కావడంతో వాహనాలు దిగబడుతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ రోడ్డుపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో బురదయమమై దిగబడుతున్నాయి. మహబూబ్‌నగర్ వెళ్లే వాహనాలు పెద్ద నందిగామ, హస్నాబాద్‌ల మీదుగా హైవేపైకి చేరుకుంటూ వాహనదారులు చుట్టూ తిరగాల్సి వస్తోంది. సయమాభావంతో పాటు డీజిల్ ఖర్చు ఎక్కువవుతోంది. కాంట్రాక్టర్ రోడ్డు పనులు వేగవంతంగా చేయించేలా చూడాలని అధికారులను కోరుతున్నారు.

ఘనంగా తుల్జాభవానీ ప్రతిష్ఠాపన వేడుకలు



విరాళం అందజేస్తున్న ఆయిల్ల శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మైసిగండిలో నూతనంగా నిర్మించిన తుల్జాభవానీ మాత ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను నిర్వహించారు. వేదపండితులు రాజుశర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి పీసీసీ సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్‌గౌడ్ రూ.25వేల విరాళం ఇచ్చారు. ఆలయ నిర్వాహకులు, స్థానిక నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో హీరాసింగ్, యాదగిరి, తులసీరామ్ నాయక్, బిక్కు, గోపాల్, జగన్, భీంజీ, రాజు, రమేశ్, రతన్, సాయికుమార్, రాము, జవహర్‌లాల్ నాయక్ ఉన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాద్‌రావు

స్థానిక ఎన్నికల్లో విజయమే బీజేపీ లక్ష్యం

కులకచర్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పోటీచేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో బుధవారం కులకచర్లలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీచేస్తుందని తెలిపారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దళిత మోర్చా మండల అధ్యక్షుడిగా బెందురు ఆంజనేయులు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా చలివేంద్రం మహేశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల కో-కన్వీనర్ గాదె మల్లేశ్, టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్ వెంకటయ్య, స్టేట్ కౌన్సిల్ మెంబర్ అంజిలయ్య, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సౌమ్యవెంకట్రామ్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు మహిపాల్, నాయకులు భృంగి హరికృష్ణ, సూర్యకాంత్, నరేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అపస్మారక స్థితిలోకి వెళ్లడంతోనే మృతి

విద్యార్థి మరణంపై నల్సార్ వర్సిటీ ప్రకటన

మేడ్చల్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్సార్ విద్యార్థి సహస్రాన్షు పాండే మృతిపై వస్తున్న అపోహల్లో ఎటువంటి నిజం లేదని, సినిమా చూస్తూ అకస్మాత్తుగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందాడని నల్సార్ స్టూడెంట్స్ బార్ కౌన్సిల్, వైస్ చాన్స్‌లర్ కృష్ణదేవ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన సహస్రాన్షును స్పృహలోకి తీసుకువచ్చేందుకు అతని సహచరులు ప్రయత్నం చేశారని, వెంటనే సమాచారాన్ని యూనివర్సిటీ హెల్త్ సెంటర్‌కు అందించారన్నారు. అయితే రాత్రి డ్యూటీలో ఉన్న డాక్టర్ వెంటనే స్పందించలేదని, సంఘటనా స్థలానికి వచ్చి అత్యవసర చికిత్స అందించేందుకు సంసిద్ధత చూపలేదన్నారు. వెంటనే అంబులెన్స్‌లో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారన్నారు. అంబులెన్స్‌లో కూడా యూనివర్సిటీ డ్యూటీ డాక్టర్ అపస్మారకస్థితిలో ఉన్న విద్యార్థికి ఏ తీరులో కూడా సహకరించలేదని, ఆక్సిజన్ సిలిండర్‌ను కూడా విప్పి విద్యార్థికి ఆక్సిజన్ అందించలేకపోయాడన్నారు. ఆసుపత్రికి చేరిన తర్వాత సహస్రాన్షును పరిశీలించిన వైద్యులు అప్పటికే అతడు మృతిచెందినట్లు తెలుపడంతో సమాచారాన్ని వైస్ చాన్స్‌లర్‌కు చేరవేశామన్నారు. వైస్ చాన్స్‌లర్ ఆసుపత్రికి చేరుకుని సమాచారాన్ని స్థానిక పోలీసులకు, విద్యార్థి తల్లిదండ్రులకు చేరవేసి తల్లిదండ్రుల కోరిక మేరకు మృతదేహాన్ని ఛత్తీస్‌గఢ్‌లోని అతడి స్వస్థలానికి పంపించినట్లు ప్రకటనలో వివరించారు. యూనివర్సిటీ అధికారులు ఈ విషయాన్ని ఆదివారం రాత్రి యూనివర్సిటీ చాన్స్‌లర్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తెలియజేశారన్నారు. విద్యార్థి మృతిపై తప్పుడు అపోహలు సృష్టించవద్దని వారు కోరారు.

దుర్గామాతకు ఘన పూజలు


మహేశ్వరం : అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


దసరా శరన్నవరాత్రోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. కొన్నిచోట్ల మండపాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు మూడోరోజు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు దుర్గాదేవిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.


ఆమనగల్లు : మార్కండేయ ఆలయంలో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


కడ్తాల్ : మైసిగండిలో పూజల్లో ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలీ పంతు తదితరులు


చేవెళ్ల : రచ్చబండ మండపం వద్ద సత్యసాయి స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన


షాబాద్ : పూజలో మహిళలు..


చేవెళ్ల : మల్కాపూర్‌లో గ్రామస్తులు..


చౌదరిగూడ : తుమ్మలపల్లిలో పూజలు..


కేశంపేట : చింతకుంటపల్లిలో నిర్వహించిన పూజల్లో గ్రామస్తులు

నేరాల అదుపునకు సీసీ కెమెరాలు దోహదం


కందుకూరు : సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ సీతారామ్

కందుకూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నేరాలను అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని సీఐ సీతారామ్ అన్నారు. గూడూరు గ్రామానికి చెందిన బండి సత్తయ్య, చిలుకల ఆంజనేయులు, మండలంలోని మాలగూడూరులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, నేర నియంత్రణ, సైబర్‌క్రైం, మాదక ద్రవ్యాల వినియోగం, దుష్పరిణామాలు వంటి విషయాలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మాలగూడూరులో 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన సత్తయ్య, ఆంజనేయులును సీఐ అభినందించారు. కార్యక్రమంలో నాయకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

చౌదరిగూడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్సై వెంకటేష్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కెమెరాలను ఆయన పరిశీలించారు. చౌదరిగూడకు చెందిన ఉమ్మడి కొందుర్గు మండల మాజీ ఎంపీపీ బస్వరాజ్‌గౌడ్, అనంతంగౌడ్, లింగంగౌడ్, నర్సింహులు గౌడ్‌లు సొంత నిధులతో పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అజ్మీరీ, చోటుమియా తదితరులు పాల్గొన్నారు.


చౌదరిగూడ : ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్సై వెంకటేష్

దిగుబడి దిగులు!

(ఐదో పేజీ తరువాయి)

అంచనా వేశారు. దీనిని బట్టి జిల్లాలో సగటు 9.1 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని తెలిపారు. ఇక పోతే సాధారణంగా ఎకరానికి సగటు పత్తి దిగుబడులు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు ఉంటాయి. జిల్లాలోని మాడ్గు ల, చేవెళ్ల, శంకరపల్లి, యాచారం, కందుకూరు, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, కేశంపేట మండలాల్లో అత్యధిక దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. అయితే, ఇందులో మాడ్గుల, చేవెళ్ల మండలాల్లో అత్యధికంగా ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేయగా.. కొత్తూరు, నందిగామల్లో అతి తక్కువగా సగటు ఏడు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని నివేదికలో పేర్కొన్నారు.

షాబాద్‌లో అధిక సాగు

పత్తి సాగులో మాడ్గుల మండలం అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ జిల్లాలోనే అత్యధికంగా 50,750 ఎకరాల్లో రైతులు పత్తి పంట వేశారు. ఈ ఏడాది ఇక్కడ దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటాయని అధికారులు అంచనా వేశారు. ఇక్కడ ఎకరాకు సగటు 12 క్వింటాళ్ల దిగుబడులు ఉంటాయని అంచనా వేశారు. ఆతర్వాత షాబాద్ మండలంలో 13,505 ఎకరాల్లో, చేవెళ్ల మండలంలో 10,687 ఎకరాల్లో, కేశంపేటలో 7500 ఎకరాల్లో, కొందుర్గులో 7300 ఎకరాల్లో, ఆమనగల్లు లో 7120 ఎకరాల్లో పత్తి పంట వేశారు.

భూ సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్ రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కేశంపేట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే రైతుల భూ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్ తహసీల్దార్‌ను కోరారు. ఈమేరకు బుధవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి తరలివెళ్లి తహసీల్దార్ రాజేందర్‌రెడ్డితో సమావేశమయ్యారు. మండలంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వారు కోరారు. అలాగే జీపీవోలు గ్రామాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నాయకులతో కలిసి తహసీల్దార్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప, మహిళా అధ్యక్షురాలు గుండె రాణి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, అబ్బి నందరయ్య, చెవేళ్ల నర్సింలు, సమీర్ పటేల్, రాజు, సుదర్శన్, లింగం, అంజయ్య, పాండు, కోడురు రాములు, వట్టెల లింగం యాదవ్, తుమ్మల గోపాల్, అనసూయమ్మ, అల్వాల ప్రకాశ్ గౌడ్, నరసింహ గౌడ్, యాదగిరి చారి తదితరులు పాల్గొన్నారు.

జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి


మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న రుద్రకుమార్, దేవేందర్

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్యజ్యోతి): మున్సిపల్ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఈ విషయంలో మొయినాబాద్ మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్, అల్లి దేవేందర్‌లు ఆరోపించారు. బుధవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ జమీల్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మొయినాబాద్ మున్సిపాలిటీ ఏర్పడి 9 నెలలు గడుస్తున్నా జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కార్మికులకు దుస్తులు, గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే మున్సిపల్ సిబ్బంది విధులు బహిష్కరించి నిరవధికంగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ మండల కన్వీనర్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్, దప్పు మహేందర్, మేకల అశోక్, నాగేష్ గౌడ్, రత్నం, సుధాకర్, సురేష్, కొమ్ము కృష్ణ, జగన్, ఏసు, నరసింహ, వెంకటేష్ ప్రమీల, కృష్ణవేణి, మైసమ్మ తదితరులు పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం

ఆమనగల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దైవ కార్యక్రమాలు సమాజ శాంతి స్థాపనకు, మానవాళి సన్మార్గ పురోగమనానికి దోహదపడుతాయని శ్రీ రామదూత ఆశ్రమ పీఠాధిపతి శివానంద స్వామి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కన్యకా పరమేశ్వరిదేవి ఆలయాన్ని బుధవారం శివానందస్వామి సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో శివానంద స్వామిని సత్కరించారు. ఆలయ నిర్వాహకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు నటరాజ్ యాదయ్య, బికుమాండ్ల రమేశ్, డాక్టర్ శ్రీనివాస్, నర్సింహ, అర్థం లక్ష్మయ్య, చంద్రశేఖర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుక


ఫ్రెషర్స్ డేలో అధ్యాపకులు, విద్యార్థులు

శంషాబాద్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ మాధవ రెడ్డి, అధ్యాపకులున్నారు.

అభివృద్ధి పనులు చేపడతాం : మల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఈమేరకు మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ, సాయిబాబానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి కాలనీ సమస్యలను వివరించారు. భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసిన వారిలో కాలనీ అధ్యక్షుడు ధన్‌రాజ్‌గౌడ్, గౌరవాధ్యక్షుడు సికిందర్‌రెడ్డి, కావలి వెంకటరమణ, నర్సింహ, సురేష్ తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఆర్టీసీ, సాయిబాబానగర్ కాలనీ వాసులు

శాస్త్రీయ పద్ధతిలో డెయిరీ నిర్వహణ లాభదాయకం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కొండల్‌రెడ్డి

షాబాద్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతిలో డెయిరీ నిర్వహిస్తే పాడి రైతులు అధిక లాభాలు పొందవచ్చని పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం(రాజేంద్రనగర్) మాజీ రిజిస్ట్రార్, పశువైద్య విశ్వవిద్యాలయం డాక్టర్ కొండల్‌రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్‌లో ముదిరాజ్ భవన్‌లో పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ వర్సిటీ, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో డెయిరీ సాగు-పాల ఉత్పత్తుల విలువ జోడింపుపై మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతుల ఆధారంగా ఆధునిక డెయిరీ ఫారాలను స్థాపించి, పశుపోషణ, ఆవుల గదుల నిర్మాణంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలన్నారు. సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ శశికుమార్, డాక్టర్ సాహిత్యరాణిలు మాట్లాడుతూ పాల ఉత్పత్తి ద్వారా కోవా, పనీర్, చన్నా, రసమలై, బసుందీ, మజ్జిగ, లస్సీ, ఫ్లేవర్‌మిల్క్ వంటి విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీపై రైతులకు క్లుప్తంగా వివరించారు. అనంతరం మహిళా పాడిరైతులకు శిక్షణ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో షాబాద్ పశువైద్యాధికారి స్రవంతి, పాడిరైతులు గౌరీశ్వర్, రాజు, యాదయ్య, మాణిక్యం, రాములు, శ్రీనివాస్, మహేష్, పూర్ణచందర్, రమ్య, స్వరూప, యజ్ఞశ్రీ, పద్మ, మహిళా పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి


డాక్టర్ ప్రణీత్‌కు స్టేషనరీ అందజేస్తున్న వెంకటేశ్

షాబాద్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వెంకటేశ్ కోరారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని చందన్‌వెల్లి ప్రభుత్వ ఆ సుపత్రికి స్టేషనరీ, ప్రింటింగ్ క్యాట్రిజ్‌ను సమకూర్చి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. డాక్టర్ ప్రణీత్, గోపాల్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

తలకొండపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేసి వారి సొంతింటి కలను సాకారం చేస్తుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంబాజీ అన్నారు. వెల్జాలలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యదర్శి శరత్, నర్సింహులు, అజీజ్, కృష్ణయ్య, ఆరిఫ్, శివ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

కడ్తాల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబొద్దీన్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్ది రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. మక్తమాదారంనకు చెందిన పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కిసాన్‌సెల్ మండలాధ్యక్షుడు బాల్‌రాజ్, నారాయణ, చెన్నయ్య, యాదయ్య, ప్రేమాచారి, లక్ష్మయ్య, యాదగిరి, సురేశ్, ఖరీమ్ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు ఆర్థికసాయం


కరపత్రం విడుదల చేస్తున్న రజక సంఘం, కాంగ్రెస్ నాయకులు

కేశంపేట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పల్లె ఆనంద్ కుమార్ ఆర్థికసాయం అందించారు. బుధవారం గ్రామంలోని ఆయన నివాసంలో కలిసి రజకసంఘం నాయకులు కేశంపేటలో ఏర్పాటు చేసే ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు సాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన రూ.21వేల నగదు అందించారు. అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కానం ప్రేమ్‌కుమార్ గౌడ్ రూ.5,116 అందించారు. రజకసంఘం నాయకులు తదితరులు ఉన్నారు. కాగా, చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కరపత్రం బుధవారం కేశంపేట మండల కేంద్రంలో రజక సంఘం, కాంగ్రెస్ నాయకులు విడుదల చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహాన్ని ఆమె జయంతిని పురస్కరించుకొని ఈనెల 26(శుక్రవారం)న షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ ఆవిష్కరిస్తారని రజక సంఘం మండలాధ్యక్షుడు వెంకటపురం రాములు తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, అనుమగళ్ల రమేష్, భాస్కర్ గౌడ్, తుమ్మల గోపాల్, రాజేందర్‌రెడ్డి, అంజయ్య, రాములు, నరసింహారెడ్డి, ఇబ్రహీం, ప్రకాశ్ గౌడ్, రజక సంఘం నాయకులు బాలరాజ ఆలుగొండ శీనయ్య, బాలరాజ, రాజు, గిరి, జంగయ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

శంషాబాద్ రూరల్/కొత్తూర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని మదన్‌పల్లి తండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహ్, స్వస్థ్ నారీ శసక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిమ్స్ హోమియోపతి మెడికల్ కళాశాల, ఆసుపత్రిలో గల కమ్యూనిటీ మెడిసిన్, గైనకాలజీ విభాగం సహకారంతో బుధవారం మహిళల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యురాలు పూనమ్ సుతార్ హాజరై అవగాహన కల్పించారు. జిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మానస ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు స్కిట్‌లు, పోస్టర్ ప్రజెంటేషన్లు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, ప్రగతి, వినోద, మంగ పాల్గొన్నారు. కొత్తూర్ మండలం ఇన్ముల్‌నర్వలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి ఆధ్వర్యంలో గర్భిణీలకు, చిన్నారులకు పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారంపై అవగాహన కల్పించారు. పిల్లలకు ముర్రిపాలు పట్టించాలని రేవతి సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు రత్నమ్మ, నాగలక్ష్మి, గిరిజ, స్వరూప, రజని, గర్భిణీలు పాల్గొన్నారు.


కొత్తూర్ : కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రేవతి


శంషాబాద్ రూరల్ : అవగాహన కల్పిస్తున్న వైద్యులు

క్రైం కార్నర్

వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడు అపహరణ

- వంట గదిలోకి చొరబడి ఘాతుకం
- మూడున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు


పద్మమ్మ ఇంటివద్ద వివరాలు సేకరిస్తున్న సీఐ వీరబాబు, బైక్‌పై పారిపోతుండగా సీసీటీవీ ఫుటేజీలో నమోదైన దుండగుల చిత్రం

శంకర్‌పల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దుండగులు పట్టపగలు వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడును తెంపుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొండాకల్ గ్రామానికి చెందిన పద్మమ్మ(70) బుధవారం మధ్యాహ్న సమయంలో అనారోగ్యంతో మంచానపడ్డ తన భర్త నారాయణరెడ్డికి అన్నం తీసుకురావడానికని వంటగదిలోకి వెళ్లింది. అదే సమయంలో బైకుపై వచ్చిన ఇద్దరు దుండగులలో ఒకరు.. బయట ఉండగా, మరో వ్యక్తి వంటగదిలోకి వెళ్లి పద్మమ్మ మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును తెంపుకుని బయటకి పరుగుతీశాడు. అనంతరం ఇద్దరూ కలిసి బైక్‌పై పారిపోయారు. వెంటనే పద్మమ్మ తేరుకొని గట్టిగా అరిచింది. చుట్టుపక్కల వారు చేరుకుని వెంటనే మోకిల పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ వీరబాబు, డిటెక్టివ్ సీఐ సమరంరెడ్డిలు ఘటనాస్థలికి చేరుకుని దొంగతనం గురించి పద్మమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు దుండగులు బైక్‌పై వెలిమెల గ్రామం వైపు పారిపోయారని ఆమె చెప్పింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అయితే, ఆ దుండగులు పద్మమ్మ ఆమె భర్త మినహా ఇంట్లో మిగతా కుటుంబసభ్యులు లేరని నిర్ధారించుకున్నాకే దొంగతనానికి పాల్పడ్డారని, వారిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. కాగా, దుండగులు పారిపోయేప్పుడు రికార్డయిన సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. వ్యక్తి మృతి

ఆదిభట్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై నోయెల్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపల్ కమ్మగూడ న్యూ భవానీ కాలనీకి చెందిన శ్రీనివాస్‌రావు(55) స్కూల్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో శ్రీనివాస్ బైక్‌పై ఇంజాపూర్ నుంచి తుర్కయాంజల్ వైపు వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు

వేతనాలు వెంటనే చెల్లించాలి

కందుకూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జాతీయ ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకులు, కూలీల వేతనాలను వెంటనే మంజూరు చెల్లించాలని ఎంపీడీవో సరితకు క్షేత్ర సహాయకులు వినతిపత్రం ఇచ్చారు. మండల క్షేత్ర సహాయకుల యూనియన్ అధ్యక్షుడు పి.యాదయ్య, ప్రధాన కార్యదర్శి బండ వెంకటేష్‌ల ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చిన అనంతరం మాట్లాడారు. ప్రతి నిత్యం గ్రామాల్లో పనిచేస్తున్న తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. చేసిన పనికి ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో తమ కుటుంబాల పోషణ భారమౌతోందని తెలిపారు. ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సత్యం, టి.నరసింహ, శేఖర్, ఎం.యాదయ్య, ఎం.రాములు, కె.పెంటయ్య, పి.గణేష్, ఎ.రాజేందర్, యు.నరసింహ, యాదయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ మహాసభలను జయప్రదం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు గౌడ్

కొత్తూర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న కందుకూరు మండల కేంద్రంలో నిర్వహించే టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు సంగెం ఆంజనేయులుగౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన జర్నలిస్టుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలు, భవిష్యత్తు ప్రణాళికలు, సంక్షేమ పథకాలు, నైతిక విలువల పరిరక్షణలపై చర్చలకు మహాసభ వేదికగా నిలుస్తుందన్నారు. కార్యక్రమానికి జర్నలిస్టులు భారీ సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులు భవానీ వేణుగోపాల్, భూసమోని రమేష్, జవ్వాజి మధుసూదన్‌గౌడ్, జాండగూడెం శ్రీనివాస్‌గౌడ్, బంటారం బాల్‌రాజ్‌గౌడ్, విష్ణుకుమార్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, మజీద్, సందీప్, అంబటి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు పొందిన విద్యార్థికి సన్మానం


వంశీకృష్ణను సన్మానిస్తున్న గ్రామస్తులు

చౌదరిగూడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన, నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి వంశీకృష్ణకు ఎంబీబీఎస్ సీటు రావడం చాలా సంతోషమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం మండల పరిధిలోని చేగిరెడ్డిఘణాపూర్ గ్రామానికి చెందిన వంశీకృష్ణ తన పెద్దనాన్న బీమయ్య ప్రోత్సాహంతో నాగర్‌కర్నూల్ గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫ్రీ సీటు సాధించాడు. దాంతో గ్రామస్తులు వంశీకృష్ణను శాలువాతో సన్మానించారు.